ప్రజల చేతిలో
www.ayudamdaily.com
# ఆయుధం
The Common People's Voice
శుక్రవారం | జూన్ 26, 2026 | సంపుటి : 7 | సంచిక : 25 | పేజీలు : 2

## ప్రజల వద్దకే సుపరిపాలన

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్
- మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు వడ్డీలేని రుణాలతో ప్రభుత్వ అండ.
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇండ్ల కేటాయింపు
- రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క




2 లో

బకాయిలు ఇవ్వరు

## విద్యార్థులను అడగొద్దంటే ఎలా ?

- హైకోర్టులో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట
- ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే
- వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు




హైదరాబాద్, ఆయుధం:

**తెలంగాణ హైకోర్టులో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయవద్దని ప్రభుత్వం ఇచ్చిన జీవోపై వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.**

### మధ్యలో మేం నలిగిపోతున్నాం :

ఇదే విషయంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం, యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని, వారి తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఈ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలు ఈ ఏడాది చేరిన విద్యార్థులకే వర్తించేలా చూడాలని కూడా విన్నవించారు. వాదనలు విన్న ధర్మాసనం, జీవో 9లోని కొన్ని నిబంధనలపై వచ్చే మంగళవారం వరకు స్టే విధించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది.

### ఆగస్టు 15లోపు క్లియర్ చేస్తాం :

ప్రైవేట్ కళాశాలలు వేసిన పిటిషన్లపై హైకోర్టు ఇవాళ కూడా విచారణ జరిపింది. బకాయిలు రాకపోతే కళాశాలలు ఎలా నడుపుతారని ధర్మాసనం ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. మీరు బకాయిలు చెల్లించరు, విద్యార్థుల నుంచి వసూలు చేసుకోనివ్వరా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు? బకాయిలు ఎందుకు విడుదల చేయలేదు? పెండింగ్ బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారని ప్రశ్నల వర్షం కురిపించింది. ఆగస్టు 15లోపు ఫీజు బాకాయిలన్నీ క్లియర్ అవుతాయని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు విన్నవించారు. అయితే ఆగస్టు 15నే పిటిషన్లు విత్‌డ్రా చేసుకుంటామని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు సమాధానమిచ్చాయి.




## ఏపీలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషిచేస్తాం

- అమరావతిలో నందమూరి బాలకృష్ణ 112వ సినిమా ప్రారంభోత్సవ వేడుక
- ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టిన మంత్రి నారా లోకేష్




**అమరావతి, ఆయుధం:** ప్రజా రాజధాని అమరావతిలో తొలిసారిగా భారీ సినిమా ప్రారంభోత్సవం జరిగింది. వెలగపూడిలోని బిట్స్ పిలానీ గ్రౌండ్‌లో జరిగిన నటసింహం నందమూరి బాలకృష్ణ 112 సినిమా ప్రారంభోత్సవ వేడుకకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం క్లాప్ కొట్టి షూటింగ్ ను ప్రారంభించారు. బాలకృష్ణ కుమార్తె తేజస్విని కెమెరా స్విచ్ ఆన్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. సినిమా ప్రారంభోత్సవానికి ఎప్పుడూ వెళ్లలేదు. అద్భుత అవకాశం ఇచ్చిన ముద్దుల మావయ్య జై బాలయ్యకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా. బాలయ్య బాబు నాయకత్వంలో సినీ పరిశ్రమను ప్రజా రాజధాని అమరావతిలో పెద్దఎత్తున ప్రోత్సహించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. సినిమాతో పాటు క్రియేటర్ ఎకానమీని కూడా పెద్దఎత్తున ప్రోత్సహించాలనేది సీఎం చంద్రబాబు గారి ఆలోచన. ఇందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేయాలనే లక్ష్యంతో ప్రజాప్రభుత్వం పనిచేస్తోంది. అమరావతిలో సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. ఇది పవిత్ర భూమి. భవిష్యత్ లో మరిన్ని సినిమాలు ఇక్కడి నుంచే ప్రారంభించాలని కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్, సినీ దర్శకులు కొరటాల శివ, సినీ నిర్మాత చెరుకూరి సుధాకర్, ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, ఎంఎస్ రాజుతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొన్నారు.

## అక్రమ పచ్చడి తయారీ కేంద్రంపై టాస్క్ ఫోర్స్ దాడి

- ఒకరి అరెస్ట్
- రూ.2.25 లక్షల విలువైన కల్తీ నిల్వలు స్వాధీనం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ నగరంలోని కాశీబుగ్గ ప్రాంతంలో అత్యంత అపరిశుభ్ర వాతావరణంలో అక్రమంగా పచ్చడి తయారీ, నిల్వలు నిర్వహిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి నిర్వహించారు. ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాశీబుగ్గ సాయి వీధిలో ఉన్న ఓ నివాస గృహంలో నిర్వహించిన తనిఖీల్లో కుళ్లిపోయిన పచ్చడి ముడిసరుకులు, ఆహార పదార్థాలు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. వాటిని చిన్న ప్యాకెట్లలో ప్యాకింగ్ చేసి స్థానిక కిరాణా దుకాణాలు, ఇతర చిన్న వ్యాపార కేంద్రాలకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ వ్యవహారంలో అరికెల శ్రీనివాస్(51), కాశీబుగ్గ నివాసిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో 750 కిలోల టమోటా, 900 కిలోల మామిడి, 200 కిలోల నిమ్మకాయలు, 100 కిలోల ఉసిరికాయలు, 150 కిలోల అల్లంవెల్లుల్లి పేస్ట్‌తో కూడిన మొత్తం రూ.2,25,000 విలువైన కుళ్లిపోయిన, కల్తీ ఆహార నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న సరుకును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు బ్రాండ్ లేని లేదా అనుమానాస్పద ఆహార పదార్థాలు, పచ్చళ్లను కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని టాస్క్ ఫోర్స్ అధికారులు సూచించారు. ఇలాంటి అక్రమ నిల్వ కేంద్రాలు లేదా కల్తీ ఆహార పదార్థాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ దాడిని ఏసీపీ టాస్క్ ఫోర్స్ ఎ. మధుసూదన్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ బండారి రాజు, ఆర్ఎస్ఐ ఓ. భాను ప్రకాష్, టాస్క్ ఫోర్స్ సిబ్బంది నిర్వహించారు.






## సర్ పై బీఎల్ఏలు అవగాహనతో పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి

**ఆత్మకూరు, ఆయుధం:** ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్(SIR) ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్లు పూర్తి అవగాహనతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఏలు చొరవ చూపాలని కోరారు. SIR ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి అంశాలపై ఏజెంట్లు నిరంతరం అలర్ట్‌గా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఆత్మకూరు గ్రామ సర్పంచి పర్వతగిరి మహేశ్వరి రాజు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

## వేం నరేందర్ రెడ్డిని కలిసిన సిపిఐ నాయకులు



- పేదల ఇళ్ళు కూల్చవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**హైదరాబాద్, ఆయుధం:** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డిని సిపిఐ రాష్ట్ర నాయకులు హైదరాబాద్ లో కలిశారు. ఇటీవల హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారంలో అమానుషంగా పేదల ఇళ్ళు కూల్చివేత విషయాన్ని వేం నరేందర్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్ళారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములలో నిరుపేదలు 50 గజాలలో ఇళ్ళు నిర్మించుకుని జీవిస్తున్న వారందరికీ పట్టాలు ఇచ్చి ప్రభుత్వ సహాయం చేయాలే తప్ప నిర్ధాక్షిణ్యంగా వారి ఇండ్లను కూల్చివేసి రోడ్డున పడవేసి ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు రావద్దని అన్నారు. దీనిపై వేం నరేందర్ రెడ్డి స్పందిస్తూ పేదలకు తప్పకుండా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. వేం నరేందర్ రెడ్డిని కలిసిన వారిలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కళ్లపల్లి శ్రీనివాస రావు, ఈటి నర్సింహా, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తదితరులు ఉన్నారు.



## సర్ పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి
- బీఎల్‌వోల ఇంటింటి ఫారాల పంపిణీని పరిశీలన

**హనుమకొండ, ఆయుధం:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరికి అవకాశం కల్పించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ పట్టణంలోని చైతన్యపురి ప్రాంతంలో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎస్ఐఆర్ ఫారాలను పంపిణీ చేస్తున్న విధానాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు ఓటర్లకు ఫారాల పంపిణీ, వివరాల నమోదు, అవగాహన కల్పన తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి అర్హులైన ఓటర్లకు ఫారాలను అందజేయాలని, ఓటర్ల సందేహాలను నివృత్తి చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిబంధనల ప్రకారం పని చేయాలని అన్నారు. ఓటర్ల నుంచి అందిన ఫారాలను నిర్ణీత గడువులోగా స్వీకరించి, వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని సరైన సమాచారం అందించాలని కోరారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే కీలక ప్రక్రియ అని పేర్కొన్న కలెక్టర్, అధికారులు, బీఎల్‌వోలు పూర్తి బాధ్యతతో విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సంబంధిత సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.





2 లో

## పేదలకు పట్టాలివ్వాలి

- దశల వారీగా వామపక్షాల ఉద్యమం
- 27న నిరసన ప్రదర్శన, జూలై 1న కలెక్టరేట్ల ఎదుట పికెటింగ్
- సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు కె. బిక్షపతి, జి. ప్రభాకర్ రెడ్డి

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి




**పరకాల, ఆయుధం:** యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని పరకాలలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యాసంస్థల విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ వద్ద మారక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని కోరారు. "డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం" అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పరకాల వి.క్రాంతి కుమార్, ఎస్ఐ పి.పవన్, పోలీస్ సిబ్బంది, పట్టణ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మత్తు నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



2 లో



## ప్రత్యేక సమగ్ర సవరణలో
# ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

- గణన ఫారంలో వివరాలు నమోదు చేసిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**హనుమకొండ, ఆయుధం:** ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పిలుపునిచ్చారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి తన కుటుంబ సభ్యుల వివరాలను ఇంటింటి గణన ఫారంలో స్వయంగా నమోదు చేసి బూత్ లెవల్ అధికారులకు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 25 నుంచి జూలై 24 వరకు ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఇంటింటి గణన కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించడంతో పాటు గణన ఫారాలను అందజేస్తారని చెప్పారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకొని బీఎల్‌వోలకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, కుటుంబ వివరాలు, ఇతర సమాచారంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండేందుకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీఎల్‌వోలు ఇంటింటికి వచ్చినప్పుడు సరైన సమాచారాన్ని అందించి, గణన ఫారాలను పూర్తిగా నింపి ఇవ్వాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ విజయవంతం కావడానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, అధికారులు, సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరచడం ద్వారా ఎన్నికల ప్రక్రియ మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మారుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హన్మకొండ ఎన్నికల నాయబ్ తహసీల్దార్ విఠల్,ఆర్ ఐ దశరథ రాంరెడ్డి, సుపర్వైజర్, బీఎల్ఓ విజయ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ రంగనాయక స్వామి వారికి అభిషేకం

**వరంగల్, ఆయుధం:** వరంగల్ కాశిబుగ్గ లోని శ్రీ రంగనాయక స్వామి దేవాలయంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి పంచామృతములతో వేదమంత్రాలతో అభిషేకాలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో దేవాలయ చైర్మన్ గోసికొండ శకుంతల సుధాకర్, ధర్మకర్తలు నీలం అరుణ శ్రీనివాస్, పిట్టల కోటేశ్వర్, పల్లకొండ రాజమణి రమేష్, మేడుకుర్తి లోకేష్ సమక్షంలో పూజలు చేశారు. దేవాలయ మాజీ కోకన్వీనర్ ఆకేన వెంకటేశ్వర్లు, తలకోటి రమేష్, ఓని రజిత, వడిచెర్ల పద్మ, మాదగాని సరోజన, అనుమాండ్ల లలిత, పల్లకొండ సమ్మక్క, విజయ, సకినాల మహేష్ దంపతులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. దేవాలయ చైర్మన్ మాట్లాడుతూ ప్రతి మాసంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి పంచామృతాభిషేకాలు, పౌర్ణమి రోజు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతము, అమావాస్య రోజు చండీ హోమం, ప్రతి మంగళవారము శనివారము దక్షిణముఖ ఆంజనేయ స్వామి వారికి పంచామృతంలతో అభిషేకాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా కోరారు.

# ప్రజల వద్దకే సుపరిపాలన

- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రజా దర్బార్
- మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబనకు వడ్డీలేని రుణాలతో ప్రభుత్వ అండ.
- అర్హులైన ప్రతి పేద కుటుంబానికి పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు
- రాష్ట్ర మంత్రి ధనసరి సీతక్క



**ములుగు, ఆయుధం:** ప్రజల సమస్యలను గ్రామ స్థాయిలోనే తెలుసుకొని వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమాలను నిర్వహిస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. గురువారం ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మంగపేట మండల పరిధిలోని అక్కినేపల్లి మల్లారం, బ్రాహ్మణపల్లి, రాజుపేట, కత్తిగూడెం, నిమ్మగూడెం, దోమెడ, రామచంద్రునిపేట, వాడేగూడెం, రమణక్కపేట, చుంచుపల్లి, వాగుడుగూడెం గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలు తమ సమస్యలు, వినతిపత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల ఆర్థిక బలోపేతానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాల రూపంలో రూ.61 వేల కోట్లకు పైగా సహాయం అందించామని తెలిపారు. గతంలో మహిళా సంఘాలకు రూ.5 లక్షల వరకు మాత్రమే అందిన వడ్డీలేని రుణ పరిమితిని ప్రస్తుతం రూ.10 లక్షలకు పెంచామని పేర్కొన్నారు. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతోందని, పాడి కేంద్రాలు, కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళా సంఘాలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని తెలిపారు. గ్రామీణ మహిళలు సంఘాలుగా ఏర్పడి కలిసి పనిచేస్తే కుటుంబాల ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రజలు జిల్లా కేంద్రాలకు తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాల వద్దకే పరిపాలనను తీసుకు వెళ్లడం ప్రత్యేక ప్రజా దర్బార్ లక్ష్యమని మంత్రి తెలిపారు. ప్రజలు అందించే ప్రతి దరఖాస్తును పరిశీలించి, వాటి సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి నిర్ణీత వ్యవధిలో పరిష్కరించే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ప్రాధాన్యత క్రమంలో ఇండ్లను అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ ప్రజలకు సులభంగా దరఖాస్తులు అందించే విధంగా ప్రత్యేక ఫార్మాట్ రూపొందించామని తెలిపారు. గ్రామాల వారీగా అందుతున్న దరఖాస్తుల ద్వారా స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన ఏర్పడి, పరిష్కార చర్యలు మరింత వేగవంతం అవుతాయని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పో, ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, పంచాయతీ రాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, తహసీల్దార్, ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మత్తు నిర్మూలనకు సమష్టిగా కృషిచేయాలి

- అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవం అవగాహన ర్యాలీ
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి




**హనుమకొండ, ఆయుధం:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిపాలన ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పాల్గొన్నారు. హనుమకొండ ఆదాలత్ సర్కిల్ నుంచి జిల్లా కలెక్టరేట్ వరకు నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడం, ముఖ్యంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఫ్లాష్‌మాబ్‌లు, అవగాహన నాటికలు ప్రజలను ఆకట్టుకున్నాయి. మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ శ్రేయస్సు, సామాజిక అభివృద్ధిపై చూపే ప్రతికూల ప్రభావాలను కళారూపాల ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వ్యసనం సమాజానికి పెను సవాలుగా మారుతోందని పేర్కొన్నారు. యువత తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తేనే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యమవుతుందని అన్నారు. ఆరోగ్యకరమైన జీవన విధానం, క్రీడలు, విద్య, సృజనాత్మక కార్యక్రమాల వైపు యువతను ప్రోత్సహించడం ద్వారా వ్యసనాలకు దూరంగా ఉంచవచ్చని కలెక్టర్ తెలిపారు. మత్తు రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు, యువతతో కలిసి *“మత్తు పదార్థాలను ఉపయోగించము, ఇతరులను కూడా వాటి నుంచి దూరంగా ఉండేలా చైతన్యం కల్పిస్తాము”* అనే ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో పాల్గొన్న వారు *“డ్రగ్స్‌కు నో చెప్పండి – జీవితానికి యెస్ చెప్పండి”, *“మత్తుకు దూరం – ఆరోగ్యానికి చేరువ”*, *“మాదకద్రవ్యాలకు స్వస్తి పలుకుదాం – ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం”** వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, హనుమకొండ ఎసిపి నరసింహ రావు, డిప్యూటీ సివిల్ సర్జన్ ఎన్సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఈగల్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రవీందర్, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ అవంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు కజాంపురం దామోదర్, జిల్లా బాలల పరిరక్షణ ఇంచార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఎస్.భాస్కర్, మహిళా శక్తి కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ కళ్యాణి, సఖి అడ్మిన్ హైమావతి, డెమో అశోక్ రెడ్డి, హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ రాము, ఎఫ్ ఆర్ ఓ రవి కృష్ణ, కెయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ కే.అనితా రెడ్డి, విద్యా శాఖ సీఎంవో సుమ, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, పాఠశాల విద్యార్థిని విద్యార్థులు, విద్యా, వైద్యారోగ్య శాఖ, పోలీస్, అధికారులు పాల్గొన్నారు.

## థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్
# అధ్యక్షుడిగా వైద్యం రాజగోపాల్

- ఘనంగా 29వ వార్షికోత్సవం, నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం
- మాతృభాష పరిరక్షణకు లయన్స్ క్లబ్ తోడ్పడాలి
- తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొ.కూరపాటి వెంకటనారాయణ



**హనుమకొండ, ఆయుధం:** అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్.. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి నిర్వహిస్తున్న "క్వెస్ట్" కార్యక్రమాలతో పాటు, మాతృభాష తెలుగు వికాసానికి కూడా తమ వంతు తోడ్పాటు అందించాలని తెలుగు అకాడమీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి హనుమకొండ లయన్స్ భవన్‌లో థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ 29వ వార్షికోత్సవం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార (ఇన్‌స్టాలేషన్) వేడుకలు కనులపండువగా జరిగాయి. క్లబ్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆంగ్ల భాషా వ్యామోహంలో పడి మాతృభాషను విస్మరించడం సరికాదని, తెలుగు భాషా పరిరక్షణకు లయన్స్ ప్రతినిధులు సహకరించాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు, లయన్స్ క్లబ్ వంటి స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకొచ్చి అవసరార్థులను ఆదుకుంటే సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో 320ఎఫ్ జిల్లా నూతన గవర్నర్‌గా ఎన్నికైన నరహరి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని 80 క్లబ్బుల నూతన సారథులు ఎంతో ఉత్సాహంతో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒకరితో ఒకరు పోటీ పడాలని పిలుపునిచ్చారు. సమయపాలన, ప్రణాళికాబద్ధమైన సేవా కార్యక్రమాలతో ప్రజల మన్ననలు పొందాలన్నారు. మరో ముఖ్య అతిథి, ఎల్ సీఐఎఫ్ మల్టిపుల్ కోఆర్డినేటర్ కె.హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. విపత్తులు, ఆపద సమయాల్లో ఆదుకునేందుకు ఎల్‌సిఐఎఫ్ నిరంతరం కృషి చేస్తుందని, ఈ జిల్లాలోని అన్ని క్లబ్బులు సేవాభావంతో ఎల్‌సిఐఎఫ్‌కు నిధులు అందించాలని కోరారు. ప్రస్తుత గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ.. ఈ నెల 28న 'అవార్డ్స్ నైట్' నిర్వహిస్తున్నామని, భిన్న రంగాలలో విశేష సేవలందించిన లయన్స్ సభ్యులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు.

### నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

వచ్చే లయనిస్టిక్ సంవత్సరానికి గాను థౌజెండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. అధ్యక్షుడిగా వైద్యం రాజగోపాల్, ప్రధాన కార్యదర్శిగా గంజి నరహరి, కోశాధికారిగా మార్త పాపయ్య, నూతన కార్యవర్గ సభ్యులచే మొదటి ఉప గవర్నర్ లయన్ హరికిషన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. "నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకొని, లయన్స్ అంతర్జాతీయ సంస్థ ద్వారా సేవ చేసే అవకాశం కల్పించిన సభ్యులందరికీ ధన్యవాదాలు. క్లబ్ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ, సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థ ఔన్నత్యాన్ని మరింత పెంచుతాను." అని నూతన అధ్యక్షుడు వైద్యం రాజగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీజీలు డాక్టర్ సుధాకర్ రెడ్డి, ముచ్చ రాజిరెడ్డి, కన్నా పరశురాములు, లక్ష్మీ నరసింహారావు, డాక్టర్ రాజేందర్ రెడ్డి, ఎస్వీడీజీ రేవూరి రమణారెడ్డి తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. ఇన్‌స్టాలేషన్ చైర్మన్ తాళ్లపెల్లి సురేష్ గౌడ్ స్వాగతం పలకగా.. కోచైర్మన్ రాచర్ల రాజేష్, పాము శ్రీనివాస్, చొప్పరి సోమయ్య, జనగామ అంజిరెడ్డి, పి. వేణుమాధవ్ రావు, టి. నరేందర్, దడిగల రమేష్, మదన్ మోహన్, చిర్ర ఉపేందర్, డాక్టర్ చిర్రా రాజు, బొద్దున వెంకటేశ్వర్లు, ఆర్‌సి ఉరుగొండ రాజేందర్, తాడూరి రేణుక, జోన్ చైర్మన్ డాక్టర్ వైద్యం గౌతమ్, దుస్స శివశంకర్, శారద, నాగమణి, గ్యాట్ లీడర్స్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ప్రతినిధులు పాల్గొన్నారు.




## ఖైరతాబాద్ బడా గణేశుడు..

- ఈసారి ‘పంచముఖ సంకటహర మహాగణపతి’గా..

**హైదరాబాద్, ఆయుధం:** ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు మొదలయ్యాయి. 69 అడుగుల భారీ విగ్రహం నమూనా పోస్టర్‌ను ఉత్సవ కమిటీ ఆవిష్కరించింది. ఈ ఏడాది ‘పంచముఖ సంకటహర మహాగణపతి’గా ఖైరతాబాద్ గణేశుడు దర్శనమివ్వనున్నాడు. విగ్రహానికి ఓ వైపు సోమనాథ్ జ్యోతిర్లింగం, మరోవైపు కాళీమాత విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు. సెప్టెంబర్ 14న వినాయక చవితి పండుగ జరగనుంది. ఈ ఏడాదితో ఖైరతాబాద్‌లో బడా గణేశుడి ఉత్సవాలు ప్రారంభమై 72 ఏళ్లు పూర్తికానున్నాయి.




## ఫీజురీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలి

- అధిక ఫీజులను నియంత్రించాలి

**హైదరాబాద్, ఆయుధం:** నాటి కేసీఆర్ ప్రభుత్వం నేటి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రైవేటు విద్యా సంస్థలకు చెల్లించవలసిన 12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలనీ హిమాయత్ నగర్ రాజ్ బహదూర్ గౌర్ హాలులో గురువారం రాష్ట్ర బీసీ హక్కుల సాధన సమితి కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసినట్టు టి వెంకట్రాములు అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయనాయుడుతో కలిసి పాల్గొన్న ఈ సమావేశంలో రాష్ట్ర సమితి నిర్ణయాలను వెంకట్రాములు పేర్కొంటూ ఫీజురీయెంబర్స్ మెంట్ అందకపోవడంతో ప్రైవేటు కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వలన విద్యార్థులు వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధికఫీజులు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు నోటు బుక్స్ పేరుతో వేలాది రూపాయలు గుంజుతున్నారనీ వెంటనే ఫీజులు నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు చివరి వరకు అన్ని జిల్లాల్లో మహాసభలు జరిపి సెప్టెంబర్ రెండవ వారంలో హైదరాబాద్ లో నాలుగవ రాష్ట్ర మహాసభ జరపాలనీ, బీసీ హక్కుల సాధన కోసం అన్ని బీసీ సంఘాలతో ఐక్య ఉద్యమాలు నిర్మించాలనీ తీర్మానం చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో నేదునూరి రాజమౌళి, తాటి వెంకటేశ్వర్లు, పల్నాటి యాదయ్య, చింతకింది కుమారస్వామి. ఎ.బాపురాజు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు పట్టాలివ్వాలి

- దశల వారీగా వామపక్షాల ఉద్యమం
- 27న నిరసన ప్రదర్శన, జూలై 1న కలెక్టరేట్ల ఎదుట పికెటింగ్
- సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు కె. బిక్షపతి, జి. ప్రభాకర్ రెడ్డి




**హనుమకొండ, ఆయుధం:** పేదల ఇళ్ళ స్థలాల సాధనకు దశల వారిగా ఉద్యమం చేపట్టనున్నట్లు సిపిఐ, సిపిఎం హనుమకొండ జిల్లా కార్యదర్శులు కర్రె బిక్షపతి, గాదె ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేదల గుడిసెల కూల్చివేతలపై ఈ నెల 27న హనుమకొండలోని ఏకశిలా పార్కు నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు పదివేల మందితో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తదితరులు పాల్గొన నున్నట్లు తెలిపారు. జూలై 1న హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ఎదుట పికెటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. అలాగే ఇండ్ల కూల్చివేతను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళే విధంగా జూలై 6న హైదరాబాద్ లోని ఇందిరా పార్కు వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో మహా ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేదలపై కర్కశంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న భూకబ్జాదారులను, రియల్ ఎస్టేట్ వ్యాపారులను వెనకేసుకొస్తున్నదని విమర్శించారు. హనుమకొండలో గోపాల్ పూర్ చెరువు సుందరీకరణ పేరుతో 200 మంది పేదల గుడిసెలను కూల్చి వేశారని, గుడిసెవాసులకు పట్టాలివ్వాలని ఈ నెల 19న కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేసిన మరునాడే గుండ్ల సింగారంలో 360 మంది పేదల ఇళ్ళను కూల్చి వేశారని తెలిపారు. పేదల గుడిసెలు కూల్చి వేసే ముందు ప్రభుత్వం సర్వే నిర్వహించాలని, అనర్హులు ఉంటే తొలగించాలని, కానీ ఏమాత్రం సమాచారం లేకుండా ఒక్కసారిగా పేదల గుడిసెలపై బుల్డోజర్ లతో దాడి చేయడం ప్రభుత్వానికి తగదని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాకు గురి కాకుండా కాపాడుతున్నది వామపక్ష పార్టీ లేనని, అధికారులు, ప్రజాప్రతినిధులు కాదని అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమాలలో పేదలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి నిరసన తెలపాలని వారు కోరారు. ఈ విలేఖరుల సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, జక్కు రాజు గౌడ్, సిపిఎం జిల్లా నాయకులు ఎం. చుక్కయ్య, రాగుల రమేశ్, బొట్ల చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్‌వో చందాదారులకు అలర్ట్..
## 3 రోజుల పాటు ఈ సేవలకు బ్రేక్


**జాతీయం, ఆయుధం:**

డేటాబేస్ కన్సాలిడేషన్, క్లెయిమ్ ప్రాసెసింగ్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ అప్‌గ్రేడ్ ప్రక్రియ కోసం మూడు రోజుల పాటు కీలక పోర్టల్ సేవలను నిలిపివేస్తున్నట్లు ఈపీఎఫ్ఓ ప్రకటించింది. యూజర్లకు మెరుగైన సేవలు అందించడానికి ఈ మార్పు చేపడుతున్నట్లు పేర్కొంది. జూన్ 26వ తేదీ (అర్ధరాత్రి) నుంచి జూన్ 29వ తేదీ అర్ధరాత్రి వరకు ఈ సేవలు అందుబాటులో ఉండబోవని ఈపీఎఫ్‌లో తన వెబ్‌సైట్ లో పేర్కొంది. జూన్ 29 నుంచి సేవలు యథావిధిగా అందుబాటులోకి వస్తాయని తెలిపింది.

# 1.16 కేజీల బంగారం
## ఛార్జింగ్ లైట్‌లో దాచిపెట్టి..

**కొయ్‌కోడ్, ఆయుధం:** విదేశాల నుంచి అక్రమంగా తీసుకొచ్చిన 1.16 కేజీల బంగారాన్ని (Gold) కేరళ కొయ్‌కోడ్‌లోని కాలికట్ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఛార్జింగ్ లైట్ లో అమర్చిన 10 బంగారు బిస్కెట్లను గుర్తించి, నిందితుడిని అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి కాలికట్ విమానాశ్రయానికి చేరుకున్న నిందితుడు అస్లామ్ కస్టమ్స్ అధికారుల కళ్లుగప్పి.. బయటకు వచ్చేశాడు.

అయితే, విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు అక్కడి భద్రతా సిబ్బంది మరోసారి తనిఖీ చేయగా అసలు విషయం బయటపడింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతడి వెనక భారీ స్మగ్లింగ్ ముఠా హస్తం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ కోణంలో నిందితుడిని విచారిస్తున్నారు. ఈ నెలలోనే ఇదే విమానాశ్రయంలో విదేశాల నుంచి అక్రమంగా కిలో బంగారాన్ని స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో ముగ్గురిని అదుపులోకి తీసుకున్న కేరళ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తరచూ ఈ తరహా ఘటనలు చోటు చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.



Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695